క్లుప్తంగా

దుస్తుల వితరణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్రీవేణుగోపాల మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సీహెచ్ ఉషారాణి మంగళవారం దుస్తులు వితరణ చేశారు. ఇటీవల ఆమె రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోగా, ఆమెను గ్రామస్తులు ఉదయం సత్కరించారు. అనంతరం ఆమె తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన నూతన వస్త్రాలను అదే పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు.

భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దారుతో మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జోసెఫ్

రామభద్రపురం: రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎల్.జోసెఫ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. వాటిలో ఎన్ని సమస్యలు పరిష్కరించారన్న విషయాన్ని తహసీల్దారు సులోచనరాణిని అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన ప్రతీ ప్రజాసమస్యను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ గిరిధర్, మండల సర్వేయరు ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని, మండల కేంద్రంలోని గొల్లవీధికి చెందిన శనగల మురళి(30) అనే యువకుడు మృతి చెందాడు. మండల పరిధిలోని సాలూరు వెళ్లే బైపాస్ రోడ్డులో కనిమెరక వీధికి దిగే జంక్షన్ వద్ద ఈ దుర్ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బొబ్బిలిలోని గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో విధులు ముగించుకుని, బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహం తరలించారు.

రైతుబజారు ఏర్పాటు చేయండి

బొబ్బిలి: రైతుబజారు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని కూరగాయల దుకాణం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయాయని, ఇక్కడ రైతుబజారు లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో ఏదీ కొనలేని పరిస్థితి ఉందన్నారు. దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైతుబజారు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, వాటిని నిలబెట్టుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గ సభ్యులు

రేగిడి: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గురవాన విష్ణుమూర్తి ఎంపికయ్యారు. మండలంలోని కాగితాపల్లి గ్రామ యూటీఎఫ్ భవనంలో ఆ సంఘ కొత్త కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘ ప్రధాన కార్యదర్శిగా వారాడ సత్యంనాయుడు, గౌరవాధ్యక్షుడిగా మురపాక గణేష్, సహాధ్యక్షులుగా డి.విజయమ్మ, టీవీ గణేశ్వరరావు, కోశాధికారిగా వి.ప్రవీణ్‌కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సీహెచ్ నారాయణరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గార రాంబాబు, వైకుంఠరావు, డి.రామారావు, వై.కిశోర్, ఎస్.అప్పలనాయుడు, ఆర్.సంగంనాయుడు, ఎ.చంద్రశేఖర్, తాతన్నాయుడు, సింహాచలం తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం వారందరితో ఆ సంఘ జిల్లా కార్యదర్శి పక్కి, వాసు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

రాజాం సిటీ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని పొగిరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. జీవో నంబరు 117 రద్దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని, శాసన మండలిలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారం దిశగా చొరవ తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, నాయకులు రొంతు గణపతిరావునాయుడు, బొడ్డేపల్లి రాజేశ్వరి, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతూ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను సిబ్బంది మంగళవారం అభినందించారు. వీరంతా రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- మెనూ అమలు కష్టమేనంటున్న నిర్వాహకులు
- ఆర్థిక ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలు

మధ్యాహ్న భోజనానికి.. నిధులు చాలట్లే!



రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

రామభద్రపురం:

విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర సరుకుల ధరలు మంట పుట్టిస్తున్నాయి. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ కూడా పెంచకపోగా నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వడం లేదు. పథకం పేరు మార్చిందే తప్ప మెనూ చార్జీలు పెంచలేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నా రుచిలో తేడాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ధరల ప్రభావం అటు సామాన్య మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై కూడా పడుతోంది.

గత ప్రభుత్వంలో ఇబ్బంది లేదు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు మార్పు చేస్తుండేది. దీంతో వంట ఏజెన్సీలకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు. పథకం పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ మిగిలిన వాటిపై లేదు. దీంతో వంట ఏజెన్సీలపై ఆర్థికభారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెరిగినా.. పాత చార్జీలే..

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంట నూనె లీటరుకు రూ.30 వరకు పెరిగింది. అలాగే కిలో కందిపప్పు రూ.160, వెల్లుల్లిపాయలు కిలో రూ.400 పైనే పలుకుతున్నాయి. వేరుశనగ పలుకులు కిలో రూ.120 నుంచి రూ.130కి చేరాయి. ఇలా వంటకాల్లో వినియోగించే అన్ని సరుకుల ధరలు భారీగా పెరిగాయి. ఇక కూరగాయల ధరలు చెప్పనవసరం లేదు. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.60 పైనే ఉంది. ధరలు పెరిగినా పాత చార్జీలనే ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.88, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.8.57 ఇస్తోంది. ఇలా అయితే ఎలా సరుకులు కొనుగోలు చేసి, భోజనం అందించాలని నిర్వాహకులు వాపోతున్నారు.

పెండింగ్‌లో నిధులు..

మధ్యాహ్న భోజనానికి చెల్లించాల్సిన నిధులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు, నాలుగు నెలల నుంచి అవి అందడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించడానికి నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం కూడా పెండింగ్‌లోనే ఉండడంతో వారి కుటుంబ పోషణ కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.5లకు ఏమొస్తుందీ..



ప్రస్తుతం టీ కూడా రూ.5లకు అమ్మడం లేదు. అలాంటిది ఒక విద్యార్థికి రూ.5.88కి భోజనం వండి వడ్డించాలంటే సాధ్యమేనా.. ఇప్పుడు అన్ని నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. నాటి ధరలతో పోలిస్తే మూడింతలు పెరిగాయి.

– సీహెచ్ రవణమ్మ, వంట నిర్వాహకురాలు

నెలవారీ బిల్లులు చెల్లించాలి..



ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా నెలవారీ బిల్లులు చెల్లించాలి. అలాగే తమకు ఇచ్చే గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లో ఉండకుండా చూడాలి. సకాలంలో నెలవారీ బిల్లులు, గౌరవ వేతనం ఇవ్వాలి.

– ఎం.జ్యోతి, వంట నిర్వాహకురాలు

మెనూ చార్జీలు పెరగలేదు..



మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంపు సమాచారం రాలేదు. పాత మెనూ చార్జీలే అమలవుతున్నాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందాల్సిన బిల్లులు నెలనెలా పెడుతున్నాం. ధరలు పెరిగిన మాట వాస్తవమే. వంట నిర్వాహకుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– ఎ.తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మలేరియా జ్వరపీడితురాలిని పరామర్శిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఏ వ్యాధి మన దరిచేరదని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ తెలిపారు. కురుపాం మండలంలోని పి.లేవిడి గ్రామంలో మలేరియా జ్వరం బారినపడి చికిత్స పొందుతున్న వారిని ఆయన మంగళవారం కలిసి వారి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. వీలైనంత వరకు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, మన ఇంట్లో, ఇళ్ల ఆవరణల్లో అనవసర నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్నచోట దోమలు పెరిగి వాటి ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. డెంగీ పరీక్ష కోసం సేకరించిన రక్తపూతలను జిల్లా కేంద్రాస్పత్రికి పంపించాలని తెలిపారు. అనంతరం మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ల్యాబ్ టెక్నీషియన్ పనితీరును పర్యవేక్షించారు. రికార్డులు అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య పర్యవేక్షకులు నాగేశ్వరరావు, ఏఎన్ఎం సుమలత తదితరులు ఉన్నారు.

రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



రేగిడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

రేగిడి: వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల వివరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. దర్యాప్తు దశలో ఉన్న చోరీ కేసులను త్వరితగతిన ఛేదించాలని తెలిపారు. అలాగే దోపిడీ, దొంగతనాల కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రతీ వారం దత్తత తీసుకున్న గ్రామాల్లో పోలీసులు పర్యటించి, సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి.. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. వివాదాస్పద గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణకు సీసీ కెమరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరు మహిళా పోలీసులను ఎస్పీ అభినందించారు. ఆ తర్వాత నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, సీఐ లీలారావు, రేగిడి, సంతకవిటి ఎస్ఐలు పి.నీలావతి, ఆర్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది..

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: దేశంలోని రాష్ట్రాలన్నీ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అనుసరిస్తుంటే మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అనుసరిస్తోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని, మంగళవారం స్థానిక పట్టణంలోని పాలకొండ జంక్షన్‌లో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై అక్రమ కేసులు బనాయించి, కూటమి సర్కారు రాక్షసానందం పొందుతోందని దుయ్యబట్టారు. పీడీ యాక్టు అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు పెట్టడం సరికాదని హితవు పలికారు. ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు గుర్తు చేస్తూనే ఉంటామన్నారు. పథకాలపై ప్రజల దృష్టి పడకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం

వాడవాడలా రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన దేశ పాలనకు మనకు మనం సొంతంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన సుదినం పురస్కరించుకుని, ఏటా ఈ దినోత్సవం జరుపుకుంటుండడం విశేషం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం ఇవ్వడానికి, సామాజిక న్యాయం ప్రోత్సహించడానికే రాజ్యాంగాన్ని రూపొందించారని వక్తలు తెలిపారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరించి, గౌరవించాలని కోరారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదామని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేశారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: పాలకొండ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



తెర్లాం ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, కార్యాలయ సిబ్బంది



బొబ్బిలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ తదితరులు



బొబ్బిలిరూరల్: రంగరాయపురంలో ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వేతనదారులు



సంతకవిటి: బొద్దూరులో రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యుల వేషధారణల్లో విద్యార్థులు



బాడంగి హైస్కూల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



రాజాం ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



రేగిడి : బూరాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు



రామభద్రపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న తహసీల్దారు సులోచనరాణి, ఎంపీడీవో రత్నం



వంగర ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, అధికారులు

'పొలం పిలుస్తోంది'

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రబీ సీజన్ పంటల సాగు–తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు ఏవో మజ్జి శ్యామసుందర్ వివరించారు. అపరాలు సాగు చేసేటప్పుడు ఎప్పటికప్పుడు నీటి తడి అందిస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. మొక్క దశలో నీటితడి గమనిస్తూ కలుపునివారణ చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తెర్లాం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు, ఏవో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన మంగళవారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ కావాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామారావు, ఎంపీటీసీ శ్రీనువాసరావు, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిస్తూ సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఆందోళన బాటపట్టారు. బొబ్బిలి పట్టణంలోని ప్రధాన రహదారిపై ర్యాలీగా బయలుదేరిన నిరసనకారులు ప్రధాని మోదీ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈపీఎఫ్ పెన్షన్‌ను రూ.9 వేలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.లక్ష్మణ్‌నాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

ఫైబర్ నెట్ మరమ్మతు పనుల్లో భాగంగా రాజాం ప్రధాన రహదారిలో ఇలా ఎక్కడపడితే అక్కడ పెద్దపెద్ద గోతులు తీసి, వదిలేశారు. నాలుగు నెలలుగా వాటిని అలాగే వదిలేయడంతో అవి ఇప్పుడు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రోడ్డు పక్కనే అవి ఉండడంతో అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు ఆదమరిస్తే చాలు అని ప్రమాదం బారిన ఖచ్చితంగా పడతారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

–రాజాం





ఘనంగా లక్ష తులసీ పూజ



కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని, బొబ్బిలి పట్టణంలోని కంచర వీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసీదళాలతో పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై, మనసారా దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– బొబ్బిలి